క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేపల్లె ఉత్సవం నిర్వహించి కోలాట ప్రదర్శన చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్‌హెచ్‌ఎం జేఏసీ క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జాయింట్ యాక్షన్ కమిటీకి సంబంధించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, డాక్టర్ కరుణాకర్, పల్నాడు జిల్లా ఎన్‌హెచ్‌ఎం జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎన్‌సీడీ డాక్టర్ అనూష, సిబ్బంది కమల, అరుణ, సునీత పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ



సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడా ప్రతిభను ప్రదర్శించాలని 21వ వార్డు కౌన్సిలర్ కాకుమాను రవి అన్నారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని 21,22 వార్డులకు సంబంధించి 'ఆడుదాం ఆంధ్రా'లో సచివాలయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు, క్రీడాకారిణిలకు సోమవారం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌన్సిలర్ కాకుమాను రవి మాట్లాడుతూ క్రీడల వలన పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సత్తెనపల్లి: అనుమతులకు విరుద్ధంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి గ్రామానికి చెందిన బొర్రా శ్రీనివాసరావు పట్టణంలోని వివిధ వైన్‌షాపుల్లో 24 మద్యం సీసాలు (180ఎమ్‌ఎల్) కొనుగోలు చేసి తన బడ్డీ కొట్లో విక్రయించేందుకు ఆదివారం తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో నరసరావుపేట రోడ్డులోని చెక్ పోస్ట్ వద్ద పట్టణ సీఐ పి.ప్రభాకర్ అతన్ని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నారు. సోమవారం కోర్టుకు హాజరు పరిచారు.

వరి పంటకోత ప్రయోగం

ముప్పాళ్ళ: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం ముప్పాళ్ళలో వరిపంటకోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపికి చెందిన వరి పొలంలో 5ఇంటు5 సైజ్ వైశాల్యం గల విస్తీర్ణంలో పంట కోసి నూర్పించగా 14.500 కేజీలు దిగుబడి వచ్చింది. ఎకరానికి సుమారు 30 బస్తాల దిగుబడి(ఒక బస్తా 75కేజీలు) వస్తుందని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. ఈ ప్రయోగాన్ని సీసీఈ యాప్‌లో డేటా అప్లోడ్ చేసి, రియల్‌టైం డేటాను జిల్లా, రాష్ట్ర విభాగాలకు పంపామని తెలిపారు. వీఏఏలు పావని, శైలజ, రైతులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అచ్చంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీర్రాజు సోమవారం తెలిపారు. అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, సిబ్బంది విధిగా హాజరు కావలని ఆయన కోరారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



క్రోసూరు: క్రోసూరులోని స్ప్రిమ్స్ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్.గోవర్ధన్‌రావు, ఎం.పద్మావతి, ఉపాధ్యాయులు రిబ్బన్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోగి మంటలు , రంగవల్లులతో ప్రారంభించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి

- పింఛన్‌ను రూ.3వేలకు పెంచి ఇస్తున్న సీఎం వైఎస్ జగన్
- ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- నకరికల్లులో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



నకరికల్లులో వృద్ధురాలికి పెంచిన పింఛన్ అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని పేదలకు రూ.3వేల పింఛన్‌ను ఇస్తున్న చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రూ.3వేలకు పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. తొలుత నూతనంగా పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లు మండలంలో కొత్తగా 214 మందికి పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. మొత్తం 9,730మందికి రూ 2,91,90,000లను పింఛన్ల రూపంలో ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండుకళ్లుగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎంతమంది కట్టకట్టుకొని వచ్చినా ఓడించలేరని అన్నారు. తన ప్రాణం ఉన్నంతవరకు వైఎస్ జగన్ వెంటే నడుస్తానని అన్నారు. టీడీపీ, జనసేన మాయమాటలకు మోసపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, వైస్ ఎంపీపీ మేచారపు అనురాధ, జడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, సర్పంచ్ పరసా అంజమ్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, సలీల్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో కొత్త పింఛన్లు అందుకున్న వారితో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగూర్ మీరాన్, తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సత్తెనపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో సోమవారం నూతన పింఛన్లు, రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుకను ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగుర్ మీరాన్ మాట్లాడుతూ పింఛన్‌దారులందరికీ గత ఎన్నికల్లో హామీఇచ్చిన విధంగా రూ.3 వేలకు పెంపు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. అంతేకాకుండా కొత్త పింఛన్లతో పాటు పెరిగిన పింఛన్ సొమ్ము ప్రతి నెల ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటింటికి వచ్చి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, గత టీడీపీ పాలనకు మధ్య ఉన్న తేడాను గమనించాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అనంతరం 15 మందికి కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే గతంలో పింఛన్ పొందుతున్న వారికి రూ.3 వేల చొప్పున నగదును పంపిణీ చేశారు. వీఆర్‌ఓ అరుణ, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలు తిలకిస్తున్న మంత్రి అంబటి



ప్రథమ బహుమతి సాధించిన బాజీబాయ్

మండలస్థాయి విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: మహిళల్లో సృజనాత్మకతను వెలికితీసి సంక్రాంతి పండుగలో ఉత్సాహకరమైన వాతావరణం నింపేందుకు ఏటా వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నకరికల్లులో మండలస్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మండలస్థాయిలో ప్రతిభ చాటిన ఐదుగురికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 13వేల మంది మహిళలు ముగ్గులపోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈనెల 12వ తేదీన నియోజకవర్గస్థాయి ముగ్గులపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిని చీమలమర్రి గ్రామానికి చెందిన సీహెచ్ లలిత రూ.20వేలు, రెండోబహుమతి కుంకలగుంటకు చెందిన అశ్వనికి రూ.15వేలు, మూడోబహుమతిని చాగల్లు గ్రామానికి చెందిన కె.ప్రసన్న రూ.10వేలు, నాలుగోబహుమతిని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కె.తేజశ్రీకి రూ5వేలు, ఐదో బహుమతిగా కన్సోలేషన్ బహుమతిని నర్శింగపాడు గ్రామానికి చెందిన ఆర్.సుబ్బులు గెలుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, సర్పంచ్ పరసా అంజమ్మ, ఎంపీపీ మేచారపు అనురాధ, జడ్పీటీసి సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బి బాషా, పీఎంసి చైర్మన్ ముప్పాళ్ల మస్తాన్‌వలి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, సలీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

అచ్చంపేట: సంక్రాంతి సంబరాలలో భాగంగా స్థానిక బ్లూబెల్స్ పబ్లిక్ స్కూలులో సోమవారం జరిగిన మండల స్థాయి ముగ్గులపోటీకి విశేషస్పందన వచ్చింది. మండల నలుమూలలనుంచి సుమారు 100మందికి పైగా మహిళలు పోటీలలో పాల్గొన్నారు. పోటీలను జడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి సతీమణి తుమ్మా సుశీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అవి కనుమరుగు కాకుండా కాపాడుకోవాలన్నారు. మొదటి మూడు స్థానాలలో నిలిచిన ఎం.బాజీబాయ్, ఇందుమతి, ఎన్.జయలక్ష్మిలకు ఆమె ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.శ్రీలత, గ్రామ సర్పంచ్ గంధం సీతామహాలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి ముగ్గుల పోటీలు

సత్తెనపల్లి: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ సత్తెనపల్లి రూరల్ మండల స్థాయి ముగ్గుల పోటీలు జరుగుతాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు సోమవారం తెలిపారు. సత్తెనపల్లి మండలంలో అత్యధికంగా 3,793 మంది గ్రామస్థాయి ముగ్గుల పోటీల్లో భాగస్వాములయ్యారన్నారు. ప్రతి గ్రామం నుంచి ఐదుగురు చొప్పున విజేతలను ఎంపిక చేసి వారందరికీ మండల స్థాయిలో పోటీలు నిర్వహించి ఐదుగురు విజేతలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో ఎంపికైన ఐదుగురు విజేతలు ఈ నెల 12న సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో సత్తెనపల్లి రూరల్ మండలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ పోటీలను ప్రారంభించేందుకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. మహిళలు, మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సమస్యలు సత్వరం పరిష్కరిస్తున్నాం

మండలంలో అన్ని రకాల విద్యుత్ సమస్యలపై అడ్వైజరీ కమిటీ సమావేశం



విద్యుత్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్లు, కమిటీ సభ్యులు, అధికారులు

క్రోసూరు: మండలంలో రైతులకు, ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలున్నా విద్యుత్ అధికారులు, సిబ్బంది సత్వరమే పరిష్కరిస్తున్నారని విద్యుత్ సబ్‌స్టేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్లు ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీలా గఫ్ఫార్ తెలిపారు. సోమవారం క్రోసూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసి ఎడ్వైజరీ కమిటీ సమావేశంలో చైర్మన్లు పాల్గొని మాట్లాడుతూ మండలంలో రైతులకు పూర్తిస్థాయిలో 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని, అదేవిధంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచుకుని ఎప్పుడు అవసరమైనా సత్వరం మార్పించటం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీలలో విద్యుత్ కనెక్షన్లు, స్తంభాలు, విద్యుత్ సరఫరా పూర్తి చేసినట్లు చెప్పారు. రాత్రిళ్లు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా విద్యుత్ సిబ్బంది స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. రైతులు తమ సమస్యలేమైనా ఉంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రైతులకు విద్యుత్ సమస్యలు రాకుండా అధికారులు, సిబ్బందికి నిరంతరం సూచనలు, సలహాలు అందజేస్తున్నారని వారు తెలిపారు. మండల విద్యుత్ ఏఈ బసవరాజు, వ్యవసాయాధికారి వేణుగోపాల్, రైతులు, గాదెవారిపాలెం సర్పంచ్ దేశిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'జై ఆంధ్ర జై భారత్' లీగల్ అడ్వైజర్‌గా సాయిదుర్గా



సత్తెనపల్లి: జై ఆంధ్ర జై భారత్ సమాచార హక్కు సంఘం పల్నాడు జిల్లా మహిళా లీగల్ అడ్వైజర్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది సాయిదుర్గను నియమించారు. పట్టణంలోని ఐఎంఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాతీయస్థాయి సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ చేతుల మీదుగా ఆమె నియమక పత్రం అందుకున్నారు. నూతనంగా నియమితులైన సాయి దుర్గని కమిటీ సభ్యులు అభినందించారు. జాతీయ ప్రచార కార్యదర్శి బి.నాగసాయి ప్రసాద్, జాతీయ కమిటీ సభ్యుడు కె.వి.సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలు పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన మోడల్ టెస్ట్ పేపర్లను యూటీఎఫ్ నాయకులు సోమవారం అందజేశారు. దాతల సహకారంతో రూ.20వేలు విలులైన టెస్ట్‌పేపర్లను 300 మంది విద్యార్థులకు అందించనున్నట్లు యూటీఎఫ్ సంఘ నాయకులు తెలిపారు. దమ్మాలపాడు జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.మిరియమ్మ, దాతలు ఈవూరి సాంబిరెడ్డి, బత్తుల కోటేశ్వరరావు, పంగా హరిబాబు, రాచకొండ సాంబశివరావు, గరికపాటి జానకిరామయ్య సభ్యులు పాల్గొన్నారు.

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బెల్లంకొండ: నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై సోమవారం సాయంత్రం ఎస్ఐ కె.అమీర్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు చేశారు. మండలంలోని పులిచింతల ముంపు గ్రామమైన కేతవరంలో పాత పాడుబడ్డ ఇళ్లలో నాటు సారా కాస్తున్నారన్న సమాచారంలో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నాటు సారా తయారు చేస్తున్న న్యూ చిట్యాల గ్రామానికి చెందిన ఆడావతు చిన్న బాలు నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అతని వద్ద ఉన్న 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, సుమారుగా 100 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చే శారు. సారా తయారు చేస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్రావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగ్గురు రాజుల మహోత్సవం

- పెదకూరపాడు తిరునాళ్లలో ప్రత్యేక దివ్య పూజాబలి నిర్వహించిన గురువులు పెట్ల మరియదాను
- గ్రామ పురవీధుల్లో తేరు ఊరేగింపు



దివ్య పూజాబలి నిర్వహిస్తున్న గురువులు

పెదకూరపాడు: క్రైస్తవ విశ్వాసులు వైభవంగా 26 సంవత్సరాలు జూబిలి ముగ్గురు రాజుల మహోత్సవం పెదకూరపాడులో ఆదివారం జరుపుకున్నారు.ఈ సందర్భంగా పండగ సమిష్ట పూజను చిలకలూరిపేట విచారణ గురువులు పెట్ల మరియదాసు, నంబూరు విచారణ గురువులు పూదోట చిన్నయ్యలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి డాక్టర్ గాలిబాలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్షమ, దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండటమే క్రైస్తవ విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. దివ్య నక్షత్రం చూపిన మార్గంలో నడిచిన ముగ్గురు రాజులు బాలయేసును దర్శించుకొని మహిమత్వాన్ని పొందారన్నారు. దీనిని పురస్కరించుకుని ప్రతి ఏడాది ముగ్గురు రాజుల మహోత్సవం జరుపుకొంటారని తెలిపారు. క్రైస్తవ విశ్వాసులు ఒత్తులను సమర్పించారు. రాత్రి బాలయేసుతో కూడిన మేరిమాత విగ్రహాన్ని గ్రామ పురవీధులలో కనకతప్పెట్లు, బ్యాండు మేళాలతో ఊరేగించారు. తేరు ప్రారంభంలో పేల్చిన భారీ బాణాసంచా చూసేందుకు భక్తులు తరలివచ్చారు. స్థానిక విచారణ గురువులు పుట్టి సుందరరాజు, సంతోషలు పండగ ఏర్పాట్లును పర్యవేక్షించారు. పలువురు భక్తులు మోకాళ్లపై నడిచి తమ మొక్కులను తీర్చుకున్నారు. సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పిండమార్పిడి ప్రక్రియతో ఒంగోలు జాతి కోడెదూడ



వేల్పూరులో పిండమార్పిడి ద్వారా జన్మించిన ఒంగోలుజాతి కోడెదూడ

క్రోసూరు: ఒంగోలు జాతికి చెందిన మేలురకం కోడెదూడను పుట్టించటంలో లాంఫామ్ శాస్త్రవేత్తలు, పశువైద్యులు మరోసారి విజయం సాధించినట్లు సోమవారం మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన వివరాలు తెలుపుతూ స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి ప్రక్రియ ద్వారా ఈ కోడెదూడను పుట్టించటం జరిగిందని తెలిపారు. ఏపీ పశుసంవర్ధకశాఖ లాంఫారం, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండమార్పిడి ప్రక్రియ ద్వారా కోడెదూడ పుట్టినట్లు చెప్పారు. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామంలోని రైతు పి.వెంకట్రావుకు చెందిన నాటు ఆవు గర్భంలో మేలుజాతి ఒంగోలు జాతి పిండాన్ని గత ఏడాది మార్చి 3 వతేదీన ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 7వ తేదీన ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి కోడెదూడకు ఆవు జన్మనిచ్చిందన్నారు. లాంఫామ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకత్వంలో పిండమార్పిడి చేసినట్లు తెలిపారు.ఈ ప్రక్రియలో అండాలను సేకరించేందుకు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ, ఐవీఎఫ్, ఫలదీకరణ పిండాన్ని అభివృద్ధి చేయటంతో లాంఫామ్‌కు చెందిన డాక్టర్ ఎన్ఆర్ శ్రీకాంత్ సేవలందించినట్లు వివరించారు. ఆవును ఎంపికచేసి పిండాన్ని ఆవు గర్భంలో ప్రవేశపెట్టటానికి మండల పశువైద్యాధికారి క్రోసూ రు, బొడ్లేరు పశువైద్యులు డాక్టర్ మల్లయ్య సేవలందించారన్నారు.

అక్షరాస్యతలో ఏపీ దేశంలోనే మొదటిస్థానం

నకరికల్లు: విద్య, వైద్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకదృష్టి పెట్టారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతాశాతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేరళను అధిగమించి దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు. భవిష్యత్తులో నిరక్షరాస్యతలేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని అన్నారు. ఏ ఒక్క పేదవిద్యార్థి చదువుకు దూరం కాకూడదని అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యావసతి, ఉచిత పుస్తకాలు, భోజనం, సమదుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. పార్టీ పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, సర్పంచ్ పరసా అంజమ్మ, ఎంపీపీ మేచారపు అనురాధ, జడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బిబాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన సెయింట్ ఆన్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

క్రోసూరు: ఈనెల 6వ తేదీన పిడుగురాళ్లలో స్కాలర్స్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థుల జట్టు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజిత సోమవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు హేమచంద్ర, శ్యామ్, జహీర్ ఖాన్, ఖలీల్ పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. వీరు ఈనెల 11, 12, 13 తేదీలలో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పీఈటీ వెంకట్రావు, ఉపాధ్యాయులు జిల్లాజట్టుకు ఎంపికైన పాఠశాల క్రీడాకారులను అభినందించారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న కొత్త రామకృష్ణ, డాక్టర్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: పట్టణంలోని 30వ వార్డుకు చెందిన పి.నాగజ్యోతి కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం విద్యనభ్యశిస్తుంది. చదువులో ఎప్పుడు ముందుండే నాగజ్యోతికి ల్యాప్‌టాప్ అవసరం కాగా అది కొనే స్థోమత లేకపోవడం గుర్తించిన వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ ఉల్లంఘుల ప్రసాద్‌బాబు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావుల దృష్టికి తీసుకెళ్లారు. వీరి సహకారంతో సోమవారం రూ. 40 వేలు విలువ గల ల్యాప్‌టాప్‌ను నాగజ్యోతికి అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని, ప్రతి సంవత్సరం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కొంతమంది పిల్లల్ని దత్తత తీసుకొని విద్యాదానం చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నాగజ్యోతికి ల్యాప్‌టాప్‌ను వితరణ చేశామన్నారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్యశాలకు ఏ విధమైన సహాయం కావాల్సి వచ్చినా కొత్త రామకృష్ణ చేస్తున్నారని ఆయనతో పాటు తమను కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ 30 వార్డు ఇన్‌చార్జ్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ చదువుల్లో ఎప్పుడూ ముందుండే నాగజ్యోతికి ల్యాప్‌టాప్‌ను వితరణ చేసిన కొత్త రామకృష్ణ, డాక్టర్ లక్ష్మణ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి



భృగుబండలో వజ్రోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ బాధ్యులు

సత్తెనపల్లి: ఎస్టీయూ వజ్రోత్సవాలు ఈ నెల 12,13 తేదీలలో కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనున్నాయని, ఈ వేడుకలకు సత్తెనపల్లి మండలం నుంచి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎస్టీయూ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు ఎస్.ఎం.రహమాన్, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పారావులు కోరారు. సత్తెనపల్లి మండలం భృగుబండ, ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండలం లోని వివిధ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో వజ్రోత్సవాల పోస్టర్‌ను సోమవారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ ఎస్టీయూ స్వాతంత్ర్యానికి పూర్వమే స్థాపించిన సంఘమని కొనియాడారు. ఇప్పుడు 75 వసంతాలు పూర్తి చేసుకొని ఉపాధ్యాయ లోకానికి ఎనలేని సేవలందిస్తూ ముందుకు వెళుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర బాధ్యులు ఎస్.ఎం.సుభాని, ఫణిదం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, భృగుబండ హెచ్‌ఎం సుధాకర్, సభ్యులు సాల్మన్ రాజు, మూర్తి, టి.రాజు, సుభాని, సురేష్, నాగవేణు, సుబ్బు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



పాస్టర్స్ ఫెలోషిప్ క్రోసూరు మండల నూతన కమిటీ

88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88 త్యాళ్లూరు గ్రామంలోని ది హోలీ పెంతెకొస్తు చర్చిలో సోమవారం మండల దైవజనుల సమక్షంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాస్టర్ అశోక్(విప్పర్ల), ఉపాధ్యక్షుడు పాస్టర్ యబ్బేజు (ఎర్రబాలెం), సెక్రటరీ పాస్టర్ పౌలు(అందుకూరు), జాయింట్ సెక్రటరీ పాస్టర్ నాగరాజు(పెరికపాడు), ట్రెజరర్‌గా పాస్టర్ సత్యనారాయణరెడ్డి(పీసపాడు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఫెలోషిప్ సభ్యులుగా పాస్టర్ సందీప్, పాస్టర్ రాజారత్నం, పాస్టర్ సంసోన్, పాస్టర్ బాబూరావులు ఉన్నారు. కార్యక్రమానికి పాస్టర్ సీయోన్ బాబు, పాస్టర్ దివాకర్‌లు అధ్యక్షత వహించారు.